క్లుప్తంగా

రేపు కోరుకొండ మండల పరిషత్ సమావేశం

మధురపూడి: కోరుకొండ మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్య కుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని, కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొంటారన్నారు.

వేధింపులపై కేసు

సీతానగరం: పురుషోత్తపట్నానికి చెందిన పనమాల చిన్నబాబుపై అతడి భార్య లక్ష్మీదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ చిన్నబాబుకు విజయవాడకు చెందిన లక్ష్మీదుర్గతో వివాహమైందని, వారికి ఇద్దరు కుమారులున్నారన్నారు. అయితే చిన్నబాబు కొద్దికాలంగా భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనం



పందలపాకలో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలంపేట రామాలయం వద్ద కొలువుదీర్చిన శ్రీదేవి అమ్మవారి నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువత, మహిళలు డీజే నృత్యాలతో సందడి చేశారు. ముందుగా గురుభవాని పంపన గోవిందు ఆధ్వర్యంలో భవానీలంతా భజనలు చేశారు. అనంతరం అమ్మవారిని గ్రామంలోని శ్రీగౌరీశంకర ఆలయం వద్ద కాలువలో నిమజ్జనం చేశారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న శ్రీకాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వ్రత పూజలు చేశారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్న సమారాధన



బాబా ఆలయంలో గులాబీ అర్చన నిర్వహిస్తున్న భక్తులు

మధురపూడి: కోరుకొండ అంకాలమ్మ వారి ఆలయం వీధిలోని బాబా ఆలయంలో సోమవారం విశేష అన్న సమారాధన నిర్వహించారు. బాబా వారి సమాధి మహోత్సవాలు ఈ నెల 12 నుంచి మొదలయ్యాయి. వాటి ముగింపు సందర్భంగా సోమవారం అన్నసమారాధన జరిపారు. కోరుకొండ, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. తొలుత బాబాకు గులాబీ అర్చన, అభిషేకాలు జరిపి, హారతులు ఇచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బాబా సమాధి మహోత్సవాలు వేడుకగా నిర్వహించారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు: పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మెళ్లూరు గ్రామంలో రూ.28.28 లక్షల నిధులతో, ఆరికరేవులలో రూ.34.46 లక్షలతో, కొంకుదురులో రూ.15.79 లక్షల నిధులతో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆరికరేవుల సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

పామాయిల్ సాగుకు ప్రోత్సాహం

- ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ప్రయోజనాలు
- శతశాతం రాయితీపై మొక్కల అందజేత
- సాగు ఖర్చులతో పాటు అంతరపంటల సాగుకూ ప్రోత్సాహం



రంగంపేట మండలంలో రైతులు సాగు చేస్తున్న పామాయిల్ పంట



నర్సరీల్లో పెంచుతున్న పామాయిల్ మొక్కలు

రంగంపేట: ఆయిల్ పామ్(పామాయిల్) సాగు చేసే రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఆయిల్‌పామ్ విస్తరణ పథకంలో భాగంగా శత శాతం రాయితీపై మొక్కలు అందించడంతో పాటు సాగుకు అవసరమైన పెట్టుబడులను కూడా అందిస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో నూనె ధరలు పెరగడంతో పామాయిల్ సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఉద్యానశాఖ అధికారులు అంటున్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని రైతులు పామాయిల్ సాగుకు ముందుకు రావాలని కోరుతున్నారు.

నాలుగేళ్ల పాటు ప్రోత్సాహకాలు

ఆయిల్‌పామ్ విస్తరణ పథకంలో భాగంగా స్వదేశీ రకం విత్తనం అయితే గరిష్ఠంగా హెక్టారుకు రూ.20,000, విదేశీ రకం మొక్కలు అయితే రూ.29,000 వరకూ ప్రభుత్వం రాయితీ అందిస్తుంది. అదే విధంగా మొక్కలకు నీరు పోయడం, ఎరువులు వేయడం, కూలీల ఖర్చు, ఇతర ఖర్చులకు సంబంధించి హెక్టారుకు ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్ల పాటు పెట్టుబడి సాయాన్ని అందిస్తుంది. అలాగే పామాయిల్ తోటలో అంతర పంటల సాగుకు కూడా ప్రభుత్వం హెక్టారుకు ఏడాదికి మరో రూ.5,250 చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తుంది. ఆరేళ్లు దాటిన పామాయిల్ తోటలో అంతర పంటగా కోకో సాగు చేసుకోవచ్చు. దీనికి కూడా హెక్టారుకు ఏడాదికి రూ.5,000 చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తున్నారు. అంతర పంటలు సాగు చేసుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు. ఇక పంట చేతికి అంది వచ్చిన తరువాత గెలలను కోసేందుకు అవసరమైన పరికరాల(కత్తులు)పై రూ.2,500 వరకూ రాయితీ ఇస్తున్నారు. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ.16,950 వరకూ పలుకుతోంది. పామాయిల్ మొక్కల సాగుకు ఎడారి ఇసుక నేలలు తప్ప అన్ని రకాల నేలలు అనుకూలమే.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యానవనశాఖ ద్వారా పామాయిల్ సాగుకు అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మొక్కలను సాగు చేసుకోవాలనే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. రాయితీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది.

– కె.దివ్యశ్రీ, ఉద్యానవనశాఖ అధికారి, రంగంపేట మండలం

క్రీడాకారులకు అభినందనలు



బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

బిక్కవోలు: విశాఖపట్టణం జిల్లా నునపర్తిలో ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ జరిగిన ఆంధ్రప్రదేశ్ 9వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో బిక్కవోలు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బండారు చాందిని శ్రియ, దుళ్ల అలేఖ్యలతో పాటు గ్రామానికి చెందిన రొంగల శిరీష, బూడి ప్రసన్న భార్గవి ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం క్రీడాకారులను హెచ్‌ఎం పల్లా వీరప్రభాకర్, పీడీ ధనరాజు, బిక్కవోలు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.శశిభూషణం, పీటీలు చైతన్యకుమార్‌రెడ్డి, నరేంద్ర అభినందించారు.

జాకెట్ ముక్కల అందజేత

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి కనకదుర్గమ్మ ఆలయంలో నందిని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 300 మంది భక్తులకు సోమవారం జాకెట్ ముక్కలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధినేత కొవ్వూరి వెంకటరెడ్డి, సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం, ట్రస్టు సభ్యురాలు నందిని, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాసంశెట్టి వెంకటరావు మృతి



అనపర్తిలో వెంకట్రావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

పెదపూడి: అనపర్తిలో ఐఎల్‌టీడీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి వెంకటరావు సోమవారం మృతి చెందారు. వెంకట్రావు భౌతిక కాయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనపర్తి మండల పార్టీ అధ్యక్షుడు సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి టౌన్ అధ్యక్షుడు నల్లమిల్లి మురళీ మోహన్‌బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, చిట్టూరు కుండరివాసు, సత్తి శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పొలమూరులో ఆదివారం టెంట్‌కు తాడు కడుతూ ప్రమాదవశాత్తు గోడపై నుంచి పడి మృతి చెందిన సత్తి వీర్రాఘవరెడ్డి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దంపతులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. పొలమూరులో ద్వారంపూడి అమ్మిరెడ్డి ఇటీవల మరణించారు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దంపతులు పరామర్శించి సానుభూతి ప్రకటించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

సీతానగరం: కాటవరానికి చెందిన 60 ఏళ్ల మేకల వెంకటరావును గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ ఘటనలో అతడు గాయపడ్డాడు. కాటవరంలోని బస్టాండ్ వాటర్ ప్లాంట్ వద్ద వెంకటరావు నిలబడి ఉన్నాడు. అతడిని రాజమహేంద్రవరం నుంచి సీతానగరం వైపు వెళుతున్న తెలుపు రంగు కారు వేగంగా వచ్చి ఢీకొంది. డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా, హారన్ కొట్టకుండా రావడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెంకటరావు తలకు గాయమైంది. క్షతగాత్రుడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆసుపత్రి సమాచారం మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు.

దేవీమాతకు రెండు కాసుల నక్లెస్ సమర్పణ



దేవీమాతకు నక్లెస్ సమర్పిస్తున్న భక్తులు

రాజానగరం: దసరా ఉత్సవాల సందర్భంగా చక్రద్వారబంధంలోని దేవీచౌక్‌లో కొలువైన దేవీమాతకు అదే గ్రామానికి చెందిన ప్రగడ రమణ, సూరిబాబు రెండు కాసుల బంగారంతో తయారు చేయించిన నక్లెస్‌ను సోమవారం సమర్పించారు. ఈ ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శబరిమల బయలుదేరిన మాలధారులు



కొంకుదురులో శబరిమల యాత్రకు బయలుదేరిన స్వాములు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బాలాత్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారణ చేసిన అయ్యప్పలు సోమవారం శబరిమాల యాత్రకు బయలుదేరారు. గురుస్వామి వెలగల చల్లారెడ్డి ఆధ్వర్యంలో ఇడుముడి కట్టుకుని 45 మంది స్వాములు, మరో 10 మంది గ్రామస్తులు కలిసి యాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీవీ, మాజీ సర్పంచ్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చింతా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ చెరువుల ఆక్రమణపై ఫిర్యాదు

సీతానగరం: మండలంలోని 20 పంచాయతీల్లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయని చినకొండేపూడికి చెందిన అడ్వకేట్ చిడిపి నకుల సురేష్ సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం ప్రజా పిర్యాదుల వేదికలో ఎంపీడీవో భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు అర్జీ అందజేశారు. మండలంలోని నాగంపల్లి, చినకొండేపూడి, పురుషోత్తపట్నం, సీతానగరం, కూనవరం, రఘుదేవపురం, చీపురుపల్లి, కాటవరం, జాలిమూడి తదితర 20 పంచాయతీలలో గల చెరువులు ఆక్రమణకు గురైయ్యాయన్నారు. వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఉపగ్రహ ఛాయా చిత్రాలను అర్జీకి జత చేసి అధికారులకు అందజేశారు.

పల్లె పండుగను జయప్రదం చేయాలి



మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: మండలంలో ఈ నెల 16, 21 తేదీల్లో జరిగే పల్లె పండుగ కార్యక్రమాన్ని అధికారులందరూ జయప్రదం చేయాలని ఎంపీడీఓ ఎస్.నరేంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో రూ.3.49 కోట్లతో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేపట్టనున్నామన్నారు. దీనికి సంబంధించి ఆయా ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, పీఆర్ ఏఈ స్వామి, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జగనన్న కాలనీ వాసులు

రాజానగరం: గ్రామంలోని జగనన్న కాలనీలో నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దారు లక్ష్మీలావణ్య, ట్రాన్స్ కో ఇంజనీర్‌కు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ కాలనీలో 40కి పైగా గృహ నిర్మాణాలు చేపట్టారని, వాటిలో 20 వరకు నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. కొన్నింటిలో గృహ ప్రవేశాలు కూడా జరిగాయన్నారు. అయితే విద్యుత్ సరఫరా లేకపోవడం వలన నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. అలాగే గృహ ప్రవేశాలు చేసిన వారు చీకటిలో తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం: సంపత్ నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌కో టవర్ కండక్టర్ మార్పు పనుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఆ సమయంలో సంపత్ నగరం, నామవరం, కొండగుంటూరు, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, కొత్త తుంగపాడు, పాత తుంగపాడు, జి.యర్రంపాలెం గ్రామాలకు పైసమయంలో విద్యుత్ సరఫరాకు ఉండదన్నారు. అలాగే గురువారం కూడా పైసమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ తనకాలకు సన్మానం



తనకాల నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులు

మధురపూడి: ఇటీవల విశిష్ట సేవా పురస్కారం అందుకున్న ఏఎంసీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావుకు పౌర సన్మానం జరిగింది. కోరుకొండ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ నిబద్ధత కలిగిన నాయకుడిగా తనకాల నిలిచారన్నారు. మెట్టప్రాంతంలో సాగునీటి ఉద్యమకర్త, సాగునీటి పథకాల సాధకుడిగా ఆయనను అభినందించారు. అనంతరం గజమాల, శాలువాతో తనకాల నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఏపీఆర్ చౌదరి, నాయకులు బదిరెడ్డి దొర, కటకం చలం కర్రి గణేష్ పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి

రాజానగరం: నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథకంలో నడిపించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని సీతారామపురంలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్), 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టబోయే పనులపై సమీక్షించారు. అనంతరం లో ఓల్టేజీ నివారణకు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రంగా శ్రీను



కాంగ్రెస్ నాయకులతో మండల అధ్యక్షుడు రంగా శ్రీను

సీతానగరం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సీతానగరానికి చెందిన గుండుబోగుల శ్రీనివాసరావు (రంగా శ్రీను) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రాజమహేంద్రవరం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీవి సత్యనారాయణ చేతుల మీదుగా సోమవారం ఆయన నియామక పత్రాలను అందుకున్నారు. అనంతరం సీతానగరం పార్టీ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. తనకు మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు మార్టిన్ లూథర్, అయిల శేషగిరి, దుళ్ల సూర్యనారాయణ, మోర్త అబ్బులు, మట్ట రాము, పిర్ల గణేష్ తదితరులు రంగా శ్రీనును అభినందించారు

తాగునీటి కష్టాలు.. ప్రజల అవస్థలు



పశ్చిమగానుగూడెంలో సత్యసాయి గోదావరి ట్యాంకు దుస్థితి

మధురపూడి: నియోజకవర్గంలోని కోరుకొండ మండలంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. నీటి కోసం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. సత్యసాయి రక్షిత తాగునీటి పథకం ద్వారా గోదావరి నుంచి నీటిని సేకరించి, శుద్ధి చేసి ఈ ప్రాంతాలకు విడుదల చేసేవారు. కానీ వాటర్ ప్రాజెక్టు సిబ్బందికి జీతాలు అందక ఆందోళన బాట పట్టారు. ఇటీవల సమ్మెను విరమించినప్పటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో గోదావరి నీరు గ్రామాలకు అందడం లేదు. కోరుకొండ మండలంలో 22 గ్రామ పంచాయతీలున్నాయి. దాదాపు 82 వేల మంది జనాభా నివసిస్తున్నారు. మేజర్ పంచాయతీ గాదరాడలోని దుర్గా నగర్ ప్రాంతానికి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇక్కడ దాదాపు మూడు నెలలుగా నీటి సరఫరా లేదని, పంచాయతీ అధికారులకు తెలియజేసినా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. బూరుగుపూడి, గాడాల తదితర గ్రామాల్లో పబ్లిక్ కుళాయిల ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో జరగాల్సిన సరఫరా సక్రమంగా లేదు. రక్షిత నీరు అందజేస్తామంటూ పాలకులు ఇస్తున్న వాగ్దానాలు నీటి మీద రాతలుగా మారాయని ప్రజలు వాపోతున్నారు.



గాదరాడ దుర్గానగర్‌లో నీరు అందించని ట్యాంకు



గాదరాడదలో నిరుపయోగంగా పంచాయతీ కుళాయి